

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 26-02-2026 | సంపుటి - 26 | సంచిక -278 | రూ : 4 | పేజీలు: 8





## బడి బాగుకు..
# రూ.8,952 కోట్ల రుణం

- ఏడీబీ, ఏఐఐబీల నుంచి పొందేందుకు కేంద్రం పచ్చ జెండా
- ప్రధానంగా అభ్యసన సామర్థ్యాలు పెంచే సౌకర్యాల కోసం వినియోగం

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర సర్కారు విదేశీ బ్యాంకుల నుంచి రుణం పొందనుంది. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ తరువాయి 2లో



## మాన్యుఫ్యాక్చరింగ్
# పవర్‌గా తెలంగాణ

- అడోబ్ సీఈవోతో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. గ్లోబల్ ట్రెండ్స్, అవకాశాలు, తరువాయి 2లో

## మానవత్వాన్ని 2లో
# మంట కలిపారు

- కుమ్మెరలో సమాజం తలదించుకునేలా పోలీసుల వ్యవహారం
- బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)
- ఉద్యమాల పురిటి గడ్డలో ఇలాంటి ఘటనలు జరగడం దారుణం : ప్రముఖ కవి, గాయకులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
- నాగర్‌కర్నూల్‌లో చిన్నారి కుటుంబాన్ని పరామర్శ, మద్దతు

## తీగలాగితే
# డొంక కదిలింది

- ఒడిశా గనులశాఖ అధికారి ఇంట్లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం
- దేబబ్రత మహంతి అరెస్టు
- భువనేశ్వర్‌లో రెండంతస్తుల భవనం, 13 తులాల బంగారం గుర్తింపు

భువనేశ్వర్: తీగలాగితే డొంక కదిలినట్టు .. ఒడిశాలో ఓ చిన్న లంచం కేసు దర్యాప్తు భారీ అవినీతి కుంభకోణాన్ని బట్టబయలు చేసింది. రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రభుత్వ అధికారి ఇంట్లో కోట్ల రూపాయల నగదు లభించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం తరువాయి 2లో





## మన 'సోలార్'పై అమెరికా
# 126% సుంకం


- సహేతుకం కాని సబ్సిడీలు ఇస్తున్నందునే: యూఎస్ వాణిజ్య శాఖ
- పరిమిత ప్రభావమే అంటున్న కంపెనీలు
- స్టాక్ మార్కెట్లో కుదేలైన సోలార్ షేర్లు

అమెరికా : మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న కొన్ని సౌర విద్యుదుత్పత్తి వస్తువులపై అమెరికా 125.87% ప్రాథమిక కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని (సీవీడీ) ప్రకటించింది. భారత్ ఆయా వస్తువులపై సహేతుకం తరువాయి 2లో

## ఉగ్రవాద పోరులో
# అండగా ఉంటాం

- హమాస్ దాడిని ఖండిస్తున్నాం
- ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలుస్తాం
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం
- ఆ దేశ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం
- బహిష్కరించిన ప్రతిపక్షాలు

జెరూసలేం : ఉగ్రవాద పోరులో అండగా ఉంటామనీ, ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్‌లో హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ ఖండించారు. హమాస్ దాడిని అనాగరిక చర్యగా విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని చెప్పారు. రెండురోజుల పర్యటనలో తరువాయి 2లో



## పునాదీ నాదే..
# పూర్తిచేసేదీ నేనే

- వెలిగొండకు జులై నాటికి శ్రీశైలం నీళ్లు తెస్తాం
- సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ.436 కోట్లతో వెలిగొండ ఫీడర్ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం
- ఐదేళ్లలో వైకాపా ఖర్చు పెట్టింది రూ.500 కోట్లే
- ప్రాజెక్టు కట్టకుండానే జాతికి అంకితమంటూ జగన్ దొంగనాటకాలని ధ్వజం

2లో



# జాబ్ మేళాలతో లక్ష ఉద్యోగాలు



- 22 క్లస్టర్ల ద్వారా పరిశ్రమల విస్తరణ, ఉపాధి
- నైపుణ్యాభివృద్ధి శిక్షణతో 40 వేల మందికి కొలువులు
- మార్చినాటికి నైపుణ్యం పోర్టల్
- శాసనసభలో మంత్రి లోకేశ్

అమరావతి: 'రాష్ట్రంలో ఇంతవరకు 1,587 జాబ్‌మేళాలు నిర్వహించి 1,08,747 మందికి ఉద్యోగాలిచ్చాం. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, సీడ్ యాప్ ద్వారా 74 వేల మందికి శిక్షణ ఇచ్చాం. అందులో 40 తరువాయి 2లో

# తెలుగు రాష్ట్రాల్లో తొలి హైటెక్ హైవే

- త్వరలో అందుబాటులోకి ఖమ్మందేవరపల్లి జాతీయ రహదారి
- రెండు రాష్ట్రాలను కలిపే మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
- 162 కి.మీ. పొడవు.. 9 చోట్ల మాత్రమే ప్రవేశం, నిష్క్రమణ

2లో



# ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

జెరూసలేం : ఉగ్రవాద పోరులో అండగా ఉంటామనీ, ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్‌లో హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ ఖండించారు. హమాస్ దాడిని అనాగరిక చర్యగా విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని చెప్పారు. రెండురోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆ దేశ పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించారు. హమాస్ దాడి గురించి మాట్లాడుతూ... "మీ బాధను మేం అనుభవిస్తున్నాం. మీ బాధను పంచుకుంటాం. ప్రస్తుతం, భవిష్యత్‌లో కూడా ఇజ్రాయిల్‌పై పూర్తి నమ్మకంతో ధృఢంగా భారత్ నిలుస్తుంది" అని మోడీ చెప్పారు. ప్రజలను చంపడాన్ని, ఉగ్రవాదాన్ని ఏ కారణమూ సమర్థించదని అన్నారు. "భారత్ కూడా ఉగ్రవాద బాధను భరించింది. 26/11 ముంబయి దాడుల్లో ఇజ్రాయిల్ పౌరులతో సహా అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను మేం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాం. ఉగ్రవాదంపై సహనం లేని, రాజీలేని విధానాన్ని మేం కలిగి ఉన్నాం. ఇందులో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలూ లేవు" అని మోడీ తెలిపారు. శాంతి మార్గం ఎల్లప్పుడూ సులభం కాదని, కానీ ఈ ప్రాంతంలో చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం ఇజ్రాయిల్‌తో ప్రపంచంతో పాటు భారత్ కలిసి ఉంటుందని మోడీ చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతికి యూఎన్ భద్రతా మండలి ఆమోదించిన గాజా శాంతి ఒప్పందం ఒక మార్గాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. భారత్‌లో యూదు ప్రజలు ఎలాంటి హింస, వివక్ష లేకుండా జీవిస్తున్నారని చెప్పారు. "భారత్‌లో యూదులు తమ విశ్వాసాలను కాపాడుకున్నారు. సమాజంలో పూర్తిగా కలిసిపోయారు" అని మోడీ తెలిపారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో భారత్, ఇజ్రాయిల్ వంటి విశ్వసనీయ భాగస్వాముల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం చాలా ముఖ్యమని కూడా మోడీ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనీ, మరోవైపు ఇజ్రాయిల్ ఆవిష్కరణ, సాంకేతిక రంగాలల్లో శక్తివంతమైన దేశమని చెప్పారు. భారత్, ఇజ్రాయిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యమని మోడీ అన్నారు. మోడీకి ఇజ్రాయిల్ పార్లమెంట్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం'ను ప్రదానం చేసింది. నెస్సెట్ అత్యున్నత గౌరవంగా భావించే ఈ పతకాన్ని భారత్‌ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి చేసిన అసాధరణ కృషికి గుర్తింపుగా ప్రదానం చేస్తున్నట్టు పార్లమెంట్ తెలిపింది.

*** మోడీ ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు**

భారత ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో గందరగోళం చెలరేగింది. ఇజ్రాయిల్‌లోని ప్రతిపక్ష పార్టీలు నెస్సెట్ (ఇజ్రాయిల్ పార్లమెంట్)లో మోడీ ప్రసంగాన్ని బహిష్కరించాయి. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా నిర్ణయంతో వివాదం ప్రారంభమైంది. నెతన్యాహు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను విస్మరిస్తోందని, దీనితో భారత ప్రధాని ప్రసంగానికి హాజరు కాకూడదని నిర్ణయించాయి. ప్రతిపక్షాల బహిష్కరణతో భారత ప్రధాని పర్యటన చుట్టూ అసౌకర్య వాతావరణాన్ని ఏర్పర్చింది. మోడీ ప్రసంగించే సమయంలో పార్లమెంటులో సగం సీట్లు ఖాళీగా ఉండటం ప్రతికూల సందేశాన్ని పంపినట్టయ్యింది. ఈ పరిస్థితిని నివారించడానికి ఉన్న సభ్యులను నిలబెట్టి మోడీ..మోడీ అంటూ నినాదాలు చేయించటం గమనార్హం.

*** ఇజ్రాయిల్‌లో రెండోసారి పర్యటించిన మోడీ**

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం "ఇజ్రాయిల్, భారత్ మధ్య అద్భుతమైన పొత్తు ఉన్నది. మేం అన్ని రకాల సహకారాన్ని చర్చించబోతున్నాం" అని వివరించింది. గతేడాది ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్, భారత్ పరస్పర వాణిజ్యాన్ని విస్తరించడానికి పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేశాయి. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి అనాగరికమంటూ తీవ్రంగా ఖండించారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమంలో చిన్నారులు మహిళలుసహా 75 వేలమందికిపైగా ప్రాణాలు కోల్పోయినా, దాని గురించి తన ప్రసంగంలో మోడీ ప్రస్తావించకపోవడం గమనార్హం.

# తీగలాగితే డొంక కదిలింది

భువనేశ్వర్: తీగలాగితే డొంక కదిలినట్టు .. ఒడిశాలో ఓ చిన్న లంచం కేసు దర్యాప్తు భారీ అవినీతి కుంభకోణాన్ని బట్టబయలు చేసింది. రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ప్రభుత్వ అధికారి ఇంట్లో కోట్ల రూపాయల నగదు లభించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు పరిమాణం చూసి వారు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దేబ్రబత మహంతి అవినీతి ఆరోపణలపై అరెస్టయ్యాడు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు వ్యాపారి నుంచి డిపో నిర్వహణ, రవాణా అనుమతుల కోసం రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్టు ఫిర్యాదు అందడంతో ఒడిశా విజిలెన్స్ డైరెక్టరేట్ అధికారులు ఉచ్చు వేశారు. మంగళవారం రాత్రి లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు అనంతరం కేసు నమోదు చేసి, బుధవారం ఉదయం నుంచి మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. భువనేశ్వర్‌లోని ఆయన నివాస ఫ్లాట్, భద్రక్ జిల్లాలోని స్వగ్రామ ఇల్లు, అలాగే కటక్‌లోని కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో బయటపడిన నగదు చూసి అధికారులు ఖంగుతిన్నారు. భువనేశ్వర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ట్రాలీ బ్యాగులు, అల్మారాలు, డ్రాయర్లలో దాచిపెట్టిన నగదును లెక్కించగా రూ.4 కోట్లకు పైగా ఉన్నట్టు గుర్తించారు. లెక్కల్లో చూపించని ఈ మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని విజిలెన్స్ వర్గాలు తెలిపాయి. అదనంగా ఆయన కార్యాలయంలోని టేబుల్ డ్రాయర్‌లో మరో రూ.1.20 లక్షల నగదు కూడా పట్టుబడింది. ఇదే కాకుండా మహంతికి చెందిన మరిన్ని ఆస్తులు కూడా వెలుగులోకి వచ్చాయి. భువనేశ్వర్ సమీపంలోని పహాలా ప్రాంతంలో సుమారు 2,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండంతస్తుల భవనం, దాదాపు 13 తులాల బంగారు ఆభరణాలను అధికారులు గుర్తించారు. ఇవన్నీ ఆయన అధికారిక ఆదాయానికి మించి ఉన్నాయని అనుమానిస్తున్నారు. స్థిర, చరాస్తుల పూర్తి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు చెబుతున్న ప్రకారం.. ఒడిశా చరిత్రలో ఒకే అధికారి ఇంటి నుంచి ఇంత పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం కావడం ఇదే తొలిసారి. గతంలో కూడా పలువురు అధికారులపై సోదాలు జరిగి కోట్లు బయటపడినప్పటికీ, ఈ స్థాయి నగదు ఎప్పుడూ దొరకలేదని పేర్కొన్నారు. 2004లో జూనియర్ మైనింగ్ ఆఫీసర్‌గా చేరిన మహంతి బాలంగీర్, బారిపడ, బెర్హంపూర్, కటక్, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. తరువాత ప్రమోషన్లు పొందుతూ ఇటీవలే కటక్ సర్కిల్ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అయితే కొద్ది కాలంలోనే ఆయన అవినీతి ఆరోపణలతో చిక్కుకోవడం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా భువనేశ్వర్ విజిలెన్స్ విభాగం ఎస్పీ సరోజ్ కుమార్ సామల్ మీడియాతో మాట్లాడుతూ మహంతిని స్పెషల్ విజిలెన్స్ కోర్టులో హాజరుపరచనున్నామనీ, ఆయన ఆస్తులపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు.

# బడి బాగుకు రూ.8,952 కోట్ల రుణం

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర సర్కారు విదేశీ బ్యాంకుల నుంచి రుణం పొందనుంది. ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ)ల నుంచి మొత్తం రూ.8,952.55కోట్ల రుణం పొందేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రధానంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ఆ రుణంతో ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పేద వారే కాదు... మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం దిల్లీలో మాదిరిగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకునేలా పాఠశాలలను ఉన్నతీకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ రుణం వస్తే నిధుల కొరత తీరి... విద్యాసంస్థల బలోపేతానికి అవసరమైన పనులు వేగం పుంజుకుంటాయి. రాష్ట్రంలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించి... ప్రస్తుతం 105 పాఠశాలల నిర్మాణానికి సంకల్పించింది. ఒక్కో దాన్ని 20 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తారు. ఆ ప్రకారం మొత్తం రూ.21 వేల కోట్లు అవసరం. ఇప్పటికే 78 పాఠశాలల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడీబీ నుంచి రూ.4,049.11 కోట్ల రుణం తీసుకోనుండగా... ఈ మొత్తాన్ని నిర్మాణాలకు కాకుండా... పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు వినియోగిస్తుంది. కృత్రిమ మేధ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులను నిర్మిస్తారు. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా మరో 30% కలిపి ఖర్చు చేస్తారు.

**ప్రీ ప్రైమరీ, కేజీబీవీలకు రూ.4,903 కోట్లు**

ప్రభుత్వ పాఠశాలలను సురక్షిత, నాణ్యమైన విద్య అందించే కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ నూతన విద్యా విధానం సిఫార్సులను పాటిస్తూ పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచనున్నారు. అందుకు ఏఐఐబీ నుంచి ప్రభుత్వం రూ.4,903.44 కోట్ల రుణం పొందనుంది. ఆ నిధులతో ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఉత్తమ మౌలిక వసతులను కల్పించడంతోపాటు ఆటపాటలతో చదువు నేర్పించేందుకు అవసరమైన వస్తువులు సమకూరుస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరం(202526) కొత్తగా వెయ్యి ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో యూకేజీ తరగతులను ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం(202627) సుమారు 5 వేల పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రాథమికంగా నిర్ణయించారు. రాష్ట్రంలో 495 కేజీబీవీలున్నాయి. వాటిల్లో 283 విద్యాలయాలను ఇంటర్‌మీడియట్ వరకు విస్తరించారు. ప్రస్తుత సంవత్సరం ఒకేసారి 120 చోట్ల ఇంటర్ తరగతులను ప్రారంభించారు. ఫలితంగా మౌలిక వసతులను పెంచాల్సిన అవసరం ఏర్పడింది. దానికితోడు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) ప్రాంతంలో కొత్తగా పాఠశాలలను నిర్మించడం లేదా ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యనందించేలా అభివృద్ధి చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఏఐఐబీ నిధులను వినియోగించనుంది.

# మానవత్వాన్ని మంట కలిపారు

మహబూబ్‌నగర్ : నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్నస్వామి జాతరలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతిచెందిన ఘటనపై నాగర్‌కర్నూల్‌లో జరుగుతున్న ధర్నా శిబిరానికి పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ తదితరులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో మాటలకందని మహా విషాదం చోటు చేసుకుందని, సభ్య సమాజం తలదించుకునేలా పెత్తందార్ల వ్యవహార శైలి ఉందని అన్నారు. గుండెలు అవిసిపోయేలా హృదయవిధారకమైన ఘటన జరిగినప్పటికీ పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం అప్రజాస్వామికమని తెలిపారు. పేదలు దర్శనానికి వెళితే మరణ శాసనం లిక్కించిన పెత్తందారులను జైల్లకు పంపాల్సిందేనన్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు జరిగినప్పుడు పోలీసులు సుమోటోగా కేసును స్వీకరించాల్సింది పోయి బాధితులు దరఖాస్తు పెట్టినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పసిపాపకు పాలు పట్టాల్సిన తల్లి కన్నీరు పెట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి వెళ్లిన వారిని కులం పేరుతో అడ్డుకుని దాడి చేయడమే కాకుండా, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో పాలకులు రాజ్యాంగాన్ని సైతం ఖననం చేశారని, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ సామాన్యులకు న్యాయం దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసికందు మృతికి కారణమైన ఎనిమిది మంది నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మన 'సోలార్'పై అమెరికా 126% సుంకం

అమెరికా : మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న కొన్ని సౌర విద్యుదుత్పత్తి వస్తువులపై అమెరికా 125.87% ప్రాథమిక కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని (సీవీడీ) ప్రకటించింది. భారత్ ఆయా వస్తువులపై సహేతుకం కాని రీతిలో సబ్సిడీలు ఇవ్వడమే ఇందుకు కారణమంది. ఇండొనేషియా, లావో పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్ (లావోస్) నుంచి వచ్చే క్రిస్టలిన్ సిలికాన్ ఫొటోఓల్టాయిక్ సెల్స్‌పైనా వేర్వేరు సుంకాలను అమెరికా ప్రకటించింది. 2026 జులై 6 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని అధికారిక ఉత్తర్వు పేర్కొంది. అమెరికాలోకి 2022లో 83.86 మి. డాలర్లు (సుమారు రూ.755 కోట్లు)గా ఉన్న భారత సౌర దిగుమతులు, 2024లో 792.6 మి. డాలర్లు (దాదాపు రూ.7100 కోట్లు)గా నమోదయ్యాయి. ఏమిటీ సుంకం: తయారీ దేశంలో సబ్సిడీలు పొందితే, ఆయా వస్తువులను తక్కువ ధరలకే ఎగుమతి చేసేందుకు కంపెనీలకు వీలవుతుంది. ఫలితంగా దిగుమతి చేసుకునే దేశంలోని కంపెనీల ఉత్పత్తుల కంటే, తక్కువకే లభిస్తాయి. ఇటువంటి సందర్భంలో తమ కంపెనీలను రక్షించుకోవడానికి, దిగుమతి చేసుకునే దేశాలు కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని విధిస్తుంటాయి.

**చైనా దిగుమతులు తగ్గించేందుకే..**

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు, చైనా నుంచి దిగుమతులను తగ్గించేందుకు మనదేశం పలు చర్యలు చేపట్టింది. సోలార్ మాడ్యూళ్లు, సోలార్ పీవీ సెల్స్, ఇన్‌గాట్స్, వేఫర్ల వంటి కీలక విడిభాగాల దేశీయ తయారీని ప్రోత్సహిస్తోంది. రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్, ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవమ్ ఉత్తన్ మహాభియాన్ (పీఎమ్‌కుసుమ్) స్కీమ్, సీపీఎస్‌యూ స్కీమ్ ఫేజ్ 2 వంటి పథకాల కింద తప్పనిసరిగా దేశీయ తయారీ ప్యానెల్స్, సెల్స్‌నే వాడాలి. దిగుమతులపై 2022 ఏప్రిల్‌లో ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మనదేశం విధించింది. అధిక సామర్థ్యం ఉండే సోలార్‌ఫొటో ఓల్టాయిక్ మాడ్యూళ్ల తయారీని ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కిందకు తీసుకొచ్చారు. ఫలితంగా 202425లో చైనా నుంచి దిగుమతులు 1.7 బి. డాలర్లకు తగ్గాయి. 202324లో ఇవి 2.85 బి. డాలర్లుగా ఉన్నాయి. వియత్నాం, హాంకాంగ్, మలేషియా, సింగపూర్ నుంచి కూడా సౌర ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. మన ప్రభుత్వ ప్రోత్సాహకాలు వినియోగించుకుని, దేశీయ కంపెనీలూ ఎగుమతి చేస్తున్నాయి.

# జాబ్ మేళాలతో లక్ష ఉద్యోగాలు

అమరావతి: 'రాష్ట్రంలో ఇంతవరకు 1,587 జాబ్‌మేళాలు నిర్వహించి 1,08,747 మందికి ఉద్యోగాలిచ్చాం. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, సీడ్ యాప్ ద్వారా 74 వేల మందికి శిక్షణ ఇచ్చాం. అందులో 40 వేల మంది ఉద్యోగావకాశాలు కల్పించాం. వైకాపా ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉద్యోగులు వారి పార్టీ పనులు చేశారని, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేదని సభ్యులు పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం' అని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, బుచ్చయ్య చౌదరి, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, మద్దిపాటి వెంకట్రాజు తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన పలు అంశాలు వెల్లడించారు. వివరాలివీ..

*** 22 క్లస్టర్ల ఆధారిత వ్యవస్థ ద్వారా అన్ని పరిశ్రమలూ ఏర్పాటు**

'ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామనేది మన హామీ. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను గుర్తించాం. రాయలసీమలోని అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలు జిల్లాలో రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్, కడప, చిత్తూరు జిల్లాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, నెల్లూరులో గ్లాస్, ఏసీలు, ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైజస్, స్టీల్ ఇలా...అనేక రకాల క్లస్టర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఒక పరిశ్రమతో పాటు అనుబంధ తయారీ రంగాలను కూడా అదే వ్యవస్థలోకి తీసుకురావాలనేది దీని లక్ష్యం. ఉదాహరణకు ఐఫోన్‌లో డిజైన్, మార్కెటింగ్ మినహా మిగిలిన తయారీ అంతా ఫాక్స్‌కాన్ చేస్తుంది. ఆ ఫోన్‌లో వివిధ విభాగాలను 2వేల మంది సరఫరాదారులు అందిస్తారు. వీరందరినీ ఒకే వ్యవస్థలోకి తీసుకురావడమే క్లస్టర్. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా గ్లాస్ వినియోగం పెరుగుతుంది. దాని తయారీ యంత్రాలను ఉత్పత్తి చేసే సంస్థలను కూడా ఒకే క్లస్టర్‌లోకి తీసుకువస్తాం. ర్యాపిడ్ ప్రొటోటైపింగ్ డిజైన్ టెస్టింగ్ సెంటర్‌ను తిరుపతి ఐఐటీకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. తిరుపతి ఐఐటీలో సోలార్ సెల్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో బీటెక్, ఎంటెక్‌తోపాటు పరిశోధన కోర్సుల ఏర్పాటుకు అక్కడి డైరెక్టర్‌తో మాట్లాడుతున్నాం.

# మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌గా తెలంగాణ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బుధవారం అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. గ్లోబల్ ట్రెండ్స్, అవకాశాలు, గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్ అండ్ రీస్కిల్లింగ్‌కు సంబంధించిన అంశాలు, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన చర్యలపై సీఎంతో ఆయన చర్చించారు. తెలంగాణను మాన్యుఫ్యాక్చరింగ్ పవర్‌గా తీర్చిదిద్దాలని, ఇందుకు కొన్ని ముఖ్యమైన సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఎకానమీపై ఏఐ రెవల్యూషన్ ప్రభావం, రాబోయే రోజుల్లో ఏఐని సమర్థంగా వినియోగించుకునే అంశాలపై శంతను నారాయణ్‌తో సీఎం చర్చించారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింతగా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా శంతను నారాయణ్‌కు సీఎం... శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు.

# పునాదీ నాదే.. పూర్తిచేసేదీ నేనే

ఒంగోలు : 'సుమారు 30 ఏళ్ల క్రితం మార్కాపురంలో పర్యటించా. ఇక్కడ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, శ్రీశైలం నీళ్లు అందించాలని కోరారు. 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించా. వచ్చే జులైలో ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పూర్తికాని ప్రాజెక్టును 2024 మార్చిలో జాతికి అంకితం చేస్తున్నట్లు అప్పటి సీఎం జగన్ దొంగ నాటకమాడారని ఎద్దేవా చేశారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో రూ.436 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు బుధవారం సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం సొరంగంలో జరుగుతున్న పనులను దృశ్య మాధ్యమం ద్వారా పరిశీలించి, ఇంజినీర్లతో మాట్లాడారు. ప్రాజెక్టు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ప్రధానాంశాలివీ..

**ఈ ఏడాది వెలిగొండ.. వచ్చే ఏడాది పోలవరం**

పేదలకు దన్నుగా నిలవడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం, పోలవరం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేశాం. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించాను. ఈ ఏడాది వెలిగొండ, వచ్చే సంవత్సరం పోలవరం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. వెలిగొండకు రూ.9 వేల కోట్లు కావాలి. ఇప్పటి వరకు రూ.5,455 కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్ల పనులే చేసింది. 2021 అక్టోబరు 7న ఒంగోలులో జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ 2022 ఆగస్టు నెలాఖరుకల్లా వెలిగొండ పూర్తిచేస్తామని ప్రకటించారు. తర్వాత చీమకుర్తి, మార్కాపురం బహిరంగ సభల్లోనూ ఇదిగో ప్రాజెక్టు పూర్తి చేసేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెట్టారు.

# తెలుగు రాష్ట్రాల్లోతొలి హైటెక్ హైవే

ఖమ్మం: తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ఖమ్మం దేవరపల్లి మధ్య నిర్మించిన మొదటి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే త్వరలో అందుబాటులోకి రానుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాలుగు వరుసలుగా ఇది రూపొందుతోంది. సీసీ కెమెరాలు, సోలార్ ప్యానెళ్లు, సమాచారాన్ని అందించే క్యూఆర్ కోడ్‌లు, ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్స్, అత్యాధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ.. ఇందులోని విశేషాలు. ప్రయాణించిన దూరానికే టోల్ వసూళ్లు, పరిమిత సంఖ్యలో ప్రవేశ (ఎంట్రీ), నిష్క్రమణ (ఎగ్జిట్) ప్రదేశాలు ఇతర ప్రత్యేకతలు. ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఒక్కటీ లేదు. ఇదే మొదటిది అవుతుంది. దీన్ని మే నెలలో ప్రారంభించడానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది.

# తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి కొనసాగింపు

* **టీయూడబ్ల్యూజే–ఐజేయు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ శుభాకాంక్షలు**



మేడ్చల్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కొనసాగుతున్న కె. శ్రీనివాస్ రెడ్డిని మరో రెండేళ్లపాటు అదే పదవిలో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పత్రికారంగంలో విశేష అనుభవం, అకాడమీ అభివృద్ధికి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రెండోసారి చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా టీయూడబ్ల్యూజే-ఐజేయు మేడ్చల్ జిల్లా ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణా కార్యక్రమాల విస్తరణకు ఆయన నాయకత్వం మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వరకాల యాదగిరి, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్‌లు కూడా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. పత్రికారంగ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ చేపడతామని తెలిపారు.

# జాతీయ పంచాయతీ అవార్డుల పోటీలో సీతంపేట ఎంపిక

– **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామం జాతీయ పంచాయతీ అవార్డులు 2023-24లో పచ్చదనం-పరిశుభ్రత విభాగంలో ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సాధించిన పురోగతికి ఈ గుర్తింపు లభించిందన్నారు.బుధవారం గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ డ్రైనేజీలు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. బహిరంగ విసర్జన నిలిపివేయాలని, ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలని, చెత్త వర్గీకరణను సమర్థంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు లైబ్రరీలో అవసరమైన పాఠ్యసామగ్రి అందజేయడంతో పాటు రహదారుల గుంటలు సరిచేయడానికి రోలర్ అందజేస్తామని తెలిపారు. బయోచార్ వినియోగంతో డ్రైనేజీల పరిశుభ్రతను మెరుగుపరచాలని సూచించారు.త్వరలో జాతీయ స్థాయి బృందం పరిశీలనకు రానున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీపీఓ అనూష, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ శ్రీనివాస్, డీఎల్పీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత – ముగ్గురు రిమాండ్

* **ఎన్‌ఫోర్స్మెంట్ సీఐ ఎ. బాలరాజు**



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్ నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఫరూక్ నగర్ మండలం చింతగూడ గ్రామ పరిధిలోని శ్రీబాలాజీ పౌల్ట్రీ ఫామ్‌లో టికెదార్‌గా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఆత్మ మహతో తన స్వరాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి బూర్గుల, కాశిరెడ్డిగూడ, చింతగూడ, బాలానగర్, షాద్ నగర్ పరిసర ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్టు సమాచారం అందింది.పక్కా సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగారెడ్డి డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం 24 ఫిబ్రవరి సాయంత్రం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆత్మ మహతోను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 1.7 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుంది. ఈ అక్రమ వ్యాపారంలో సహకరిస్తున్న బీహార్‌కు చెందిన సుశీల్ కుమార్, ప్రేమ్ రామ్‌లను కూడా అధికారులు అరెస్టు చేశారు. అనంతరం ముగ్గురిని షాద్ నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించగా, కోర్టు ఆదేశాల మేరకు 25 ఫిబ్రవరి న రిమాండ్‌కు తరలించారు.ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ. బాలరాజు, ఎస్సై కె. వెంకటేశ్వర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కప్ 2025లో మేడ్చల్ అమ్మాయిల జట్టు మూడో స్థానం



ప్రజాస్ఫూర్తి,కాప్రా : గచ్చిబౌలిలో నిర్వహించిన సీఎం కప్ 2025 స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మేడ్చల్ జిల్లా అమ్మాయిల జట్టు ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించింది. ఈ నెల 20 నుంచి 23 వరకు గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా జట్లు పాల్గొన్నాయి. మూడో స్థానం సాధించించిన మేడ్చల్ మల్కాజిగిరి జట్టును అధికారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు అభినందించారు. జిల్లా క్రీడా రంగానికి ఇది గర్వకారణమని పేర్కొన్నారు.

# అలా సీజ్... ఇలా క్లియర్

- **టౌన్ ప్లానింగ్ అధికారుల సెటిల్మెంట్ దందా..?**
- **సీజ్ చేస్తారు... రాత్రికి రాత్రే తెరిపిస్తారా?**






సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి: కూకట్‌పల్లి జోన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే ఇప్పుడు అవే నిర్మాణాలకు రక్షకులుగా మారుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు నోటీసులు జారీ చేయడం, అవసరమైతే సీజ్ చర్యలు చేపట్టడం…ఆపై తెర వెనుక సెటిల్మెంట్లతో సీజ్‌ను ఎత్తివేయడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోన్ పరిధిలోని మాదాపూర్ సర్కిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

* **'సీజ్' దగ్గరే అసలు దందా మొదలవుతుందా?**

సీజ్ చేసిన భవనాల దగ్గరే అసలు సెటిల్మెంట్ దందా మొదలవుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణదారులు టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించి లక్షల రూపాయల లావాదేవీలు జరిపిన అనంతరం అధికారుల సలహాలతోనే హైకోర్టు నుంచి స్టే తెప్పించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ స్టే ముసుగులో సీజ్‌ను ఎత్తివేసి అక్రమ నిర్మాణాలకు చట్టబద్ధత కల్పిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

* **ఇతర సర్కిళ్లలో ఒకలా ఇక్కడ మరోలా..?**

నూతనంగా ఏర్పడ్డ సైబరాబాద్ మున్సిపల్ కమీషనరేట్ పరిధిలోని ఇతర సర్కిళ్లలో సీజ్ చేసిన భవనాలను సంవత్సరాల తరబడి తెరవకుండా కఠిన చర్యలు తీసుకుంటుంటే, మాదాపూర్ సర్కిల్‌లో మాత్రం స్టే చూపిస్తూ వెంటనే సీజ్‌ను ఎత్తివేయడం గమనార్హంగా మారింది. రోడ్ నెంబర్ 21 అయ్యప్ప సొసైటీ అంజనా హిల్స్ రోడ్, వి ఐ పీ కాలనీ జైహింద్ ఎన్క్లేవ్, మాదాపూర్ ప్లాట్ నంబర్లు 401 నుంచి 405 వరకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు రావడంతో సీజ్ చేసినప్పటికీ, అనంతరం తెర వెనుక లావాదేవీలతో సీజ్‌ను ఎత్తివేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కమీషనరేట్ ల విభజన అనంతరం సంబంధిత ప్లాట్లపై సీల్ తొలగించబడిందని, అక్కడ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 11న మాధాపూర్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ సంయుక్తంగా ప్లాట్లను తిరిగి సీల్ చేసినట్లు తెలిసింది. అయితే అనంతరం సీల్ మళ్లీ తొలగించబడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన కోసం ప్రయత్నించగా అధికారులు స్పందకపోవడం కోసమెరుపు.

# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

* **అధ్యక్ష కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్**



కాప్రా, ప్రజాస్ఫూర్తి : కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నూతన సభ్యులకు సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు.

* **ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనల వెల్లువ**

కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్ర మోహన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావనిరెడ్డి, కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి, కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకులు, వంజరి ప్రవీణ్ కరిపే, ఎస్ఏ. రహీమ్ తదితరులు అభినందనలు తెలిపారు.

# ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్



మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణను బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి పరిశీలించారు. శామీర్ పేట్ మండలంలోని తూంకుంటలోని సాయితేజ జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ, ఉప్పర్ పల్లిలోని ఎక్సెలెన్సియా జూనియర్ కాలేజీలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షలు జరుగుతున్న తరగతి గదులలో తిరిగి విద్యార్థులు పరీక్ష వ్రాయడాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయా అని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం ఎంత మంది పరీక్ష వ్రాసే విద్యార్థులు ఉన్నారని, అందులో గైరుహాజరు ఎంతమంది అని అడిగి తెలుసుకున్నారు. సిసి కెమెరాలు పని చేస్తున్నాయా అని పరిశీలించి, సిసి కెమెరాల డిస్ ప్లే రూం నుండి ప్రతి పరీక్ష గదిని పరిశీలించారు. పరీక్షా పత్రాలను ఏ సమాయానికి ఓపెన్ చేసారని, పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతించారా అని కాలేజీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి కిషన్, శామీర్ పేట్ మండల తహాసీల్దారు సుచరిత, తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ పరీక్ష కేంద్ర్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

* **పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనలో రాజీ పడవద్దు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి ఆదేశం.బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరీక్ష కేంద్రాలలో సౌకర్యాలు, తదితర అంశాలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్ ను అడిగి తెలుసుకున్నారు.నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పరీక్షలు రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, టాయిలెట్స్, తాగునీరు, క్లాక్ రూమ్, ప్రశ్న పత్రాలు, ఆన్సర్ షీట్ల డిపాజిట్, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వారి వెంట తీసుకువచ్చిన పుస్తకాలు, మొబైల్ ఫోన్లు, వాచ్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులన్నింటిని భద్రపరచుకునేందుకు ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తప్పనిసరిగా క్లాక్ రూమ్ ఏర్పాటు చేయాలని పునరుద్ఘటించారు.అలాగే అన్నిపరీక్ష కేంద్రాలలో తాగునీటితోపాటు, విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్లో నుంచి క్వశ్చన్ పేపర్లను జాగ్రత్తగా బందోబస్తుతోపాటు తీసుకురావాలని, అలాగే ఆన్సర్ సీట్లు సైతం పోలీస్ భద్రతతో డిపాజిట్ చేయాలని చెప్పారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ జరగడానికి వీలులేదని, అంతేకాక విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు.పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కాగా బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 18 వరకు జరగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించనుండగా, జిల్లా నుండి మొదటి, రెండవ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కలుపుకొని 27018 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మొదటి రోజు పరీక్షకు జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో కలుపుకొని 97% హాజరు నమోదయినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి తెలిపారు.

# చిన్నారి మృతికి కారకులైన వారిని శిక్షించాలి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నాగర్ కర్నూలు జిల్లా మల్లన్న జాతరలో రెండు సంవత్సరాల చిన్నారిని కాలుతో తన్ని చంపిన సర్పంచ్ పై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నేరెళ్ల రమేష్ డిమాండ్ చేశారు. చిన్నారి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా మల్లన్న జాతరలో చంద్రకళ కుటుంబాన్ని దర్శనానికి వెళ్ళనివ్వకుండా అడ్డుకొని ఆ కుటుంబం పై దాడి చేసి 2 నెలల చిన్న పాప అని చూడకుండా విచక్షణా రహితం గా కొట్టి ,దాడి చేసి అభం శుభం తెలియని పసి కందు ప్రాణం తీసిన సర్పంచ్ పై హత్య కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారందరి పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దాడులు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని, అని అన్నారు.డబ్బు కులాహంకారంతో విర్రవీగుతున్న ఇలాంటి వారిపై అధికారులు,ప్రభుత్వం, నిష్పక్షపాతంగా విచారణ చేసి, దోషులను బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు సుంకర అజిత్ కార్యదర్శి భూష రాజు పట్టణ నాయకులు రాచర్ల సర్వీస్ కనకారావు పోషి ఉల్లెంగల రమేష్ హరి సిపిఐ మహిళా సంఘం నాయకురాలు కరిష్మా రత్నకుమారి రజక సంఘం నాయకురాలు సత్తెనపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


# ఉన్నతాధికారి సునీల్ నాయక్‌పై కక్షసాధింపు హేయం

* **జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగడం హేయమని బంజారా సంఘాల జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసత్య ఆరోపణలతో ఇరికించే ప్రయత్నం జరుగుతోందన్నారు. రఘురామ కృష్ణరాజు అరెస్టు వ్యవహారంలో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని, 2024లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు లేదని తెలిపారు. ప్రస్తుతం బీహార్‌లో పనిచేస్తున్న ఆయనను వారెంట్ లేకుండా అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లడాన్ని ఖండించారు. పాట్నా కోర్టు అరెస్టుకు వారెంట్ నిరాకరించడం ప్రాథమిక విజయమన్నారు.ఎస్టీ వర్గానికి చెందిన అధికారిపై చర్యలను బంజారా సమాజం ఖండిస్తోందని, కేసులు ఎత్తివేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ధరావత్ కాన్షీరామ్, గుగులోత్ కేశవ్, గణేష్ మహరాజ్, బానోత్ రమేష్ నాయక్, గుగులోత్ భద్రు, ధరావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తొలి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తొలి రోజు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అంతరాయం లేకుండా పరీక్షలు క్రమబద్ధంగా జరిగాయని పేర్కొన్నారు.పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రశ్నాపత్రాల భద్రత, అభ్యర్థుల తనిఖీ, ఇన్విజిలేషన్, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించారు.జిల్లాలో మొత్తం 37 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, జనరల్, వొకేషనల్ కలిపి 9,685 మందిలో 9,210 మంది హాజరయ్యారు. 475 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు. మిగిలిన పరీక్షలు కూడా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయి

* **తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్**



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ. ఖాదర్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ.హెచ్.ఎస్ నగదు రహిత చికిత్స పథకం, రూ.1.20 కోట్ల ప్రమాద కోట్ల మూలనిధితో పథకానికి నేపథ్యంలో అన్ని ఉద్యోగ వర్గాల చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స లను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం ఎంతో ఆనందదాయకం అని తెలిపారు. చారిత్రక నిర్ణయంతో 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు 17 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కేబినెట్ మంత్రులకు, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ఇట్టి ప్రయోజనాలను సాధించటంలో కృషి సలిపిన టి జి వో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బి.శ్యామ్ కి నిండైన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ట్రెజరర్ వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ , సంయుక్త కార్యదర్శులు డాక్టర్. క్రొత్త విద్యా సాగర్, శ్రీరామ్, సరస్వతి పాల్గొన్నారు.

# ఐదుగురు నకిలీ డాక్టర్ల అరెస్ట్.. కంటి ఆసుపత్రుల ముసుగులో భారీ మోసం!



నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వైద్య రంగం ముసుగులో సాగుతున్న భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఎటువంటి వైద్య అర్హతలు లేకపోయినా డాక్టర్లమంటూ చెలామణి అవుతూ, ప్రజల కంటి చూపుతో చెలగాటమాడుతున్న ఐదుగురు నకిలీ డాక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు ఈ వివరాలను వెల్లడించారు.

* **తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో బట్టబయలు**

గత కొద్దిరోజులుగా పట్టణంలోని పలు కంటి ఆసుపత్రులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదు ఆసుపత్రులలో పనిచేస్తున్న వ్యక్తులకు కనీస వైద్య అర్హతలు (MBBS/ MS/Ophthalmology) లేవని తేలింది. కేవలం అనుభవంతో లేదా నకిలీ సర్టిఫికెట్లతో వీరు డాక్టర్లుగా కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

* **బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు**


నకిలీ డాక్టర్ల వైద్యం వల్ల నష్టపోయిన ఒక బాధిత మహిళతో పాటు, మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

* **డీఎస్పీ హెచ్చరిక: "ప్రజల ప్రాణాలతో ఆడితే కఠిన చర్యలు"**

ఈ సందర్భంగా డీఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ.. "అర్హత లేకుండా వైద్యం చేయడం నేరం. ఎవరైనా ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే సహించేది లేదు. పట్టణంలోని ప్రతి ఆసుపత్రిలో పనిచేసే వైద్యుల అర్హతలను తనిఖీ చేస్తాం. ప్రజలు కూడా డాక్టర్ల వద్దకు వెళ్లే ముందు వారి అర్హతలను గమనించాలి" అని సూచించారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ అరెస్టులతో మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల్లో వణుకు మొదలైంది.

# ఆ పసిపాప హంతకులకు ఉరి శిక్ష వేయాలి

: **కేటీఆర్ డిమాండ్**



తెలంగాణ సమాజం మొత్తం బాధతో, ఆవేదనతో తలదించుకునే దుర్మార్గమైన సంఘటన కుమ్మెరలో జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాపను హత్య చేసిన హంతకులను శిక్షించి జైల్లో వేయాలి, అవసరమైతే ఉరిశిక్ష వేయాలి కానీ బయటకి వదలవద్దని కేటీఆర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో కాంగ్రెస్ గూండాల దాడిలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. పసిపాప హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కడు ముమ్మాటికి దోషినే. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ ఎవరైనా ఆ పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు అండగా నిలబడటం ముమ్మాటికి తప్పే. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా వారిని జైల్లో పెట్టాలి. దాడి చేసిన 8 మంది పైన ముమ్మాటికి హత్యానేరం కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలి. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

* **ఈ దాడి మానవత్వానికే మచ్చ..**

బిడ్డకు పాలు ఇవ్వాల్సిన తల్లి ఖననం చేసి కన్నీళ్ళు పెట్టుకుంటూ న్యాయం కోసం రోడ్డు మీద కూర్చుంది. నాగర్‌కర్నూల్ అధికార యంత్రాంగం ఈరోజు ఆ బిడ్డతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఖననం చేసింది. గుడిలో దర్శనం చేసుకునే అవకాశం కల్పించమని అడిగిన పాపానికి దాడి చేసి 2 నెలల పాపను చంపేశారు. ఈ దాడి మానవత్వానికే మచ్చ.. తెలంగాణ సమాజమే తలదించుకునే సంఘటన కుమ్మెరలో జరిగింది అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రూఫ్ టాప్ సోలార్ సిస్టం పనులను మార్చి మొదటి వారంలో పూర్తి చేయాలి

* **కలెక్టర్ చంద్రశేఖర్..**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లాలో పైలెట్ పద్ధతిన ఎంపిక చేసిన గ్రామాలలో గృహ జ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు పనులను మార్చి మొదటి వారంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.బుధవారం అయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం, కనగల్ గ్రామంలో టి ఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో గృహజ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" పనులను పరిశీలించారు. కనగల్ మండలంలో, కనగల్ గ్రామంలో 292 మంది గృహ జ్యోతి లబ్ధిదారులు ఉండగా, వీరికి రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు పైలట్ పద్ధతిన ఎంపిక చేయడం జరిగింది. అంతేకాక జిల్లాలోని అనుముల మండలం అనుముల, దేవరకొండ మండలం ముదిగొండ గ్రామాలలో సైతం పైలెట్ పద్ధతిన "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 గ్రామాలలో ఈ పథకం అమలు చేయనుండగా, నల్గొండ జిల్లాలో మూడు గ్రామాలు ఇందుకు ఎంపిక కాబడ్డాయి. ఈ మూడు గ్రామాలలోని గృహ జ్యోతి లబ్ధిదారుల ఇళ్లపై రెండు కిలోవాట్ల " రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేస్తారు. ముందుగా ఎంపిక చేసిన లబ్ధిదారుల గృహాలపై "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేసేందుకు ఉన్న అనుకూలతను అధికారులు సర్వే నిర్వహించి అనంతరం "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేయనున్నారు. రెండు ,మూడు రోజుల్లో పైన పేర్కొన్న మూడు గ్రామాలలో సర్వే పూర్తయిన వెంటనే" రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటుండగా, కనగల్ గ్రామంలో ఇదివరకే 77 ఇళ్లపై "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి.రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు వల్ల గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ ద్వారా విద్యుత్తు అందుతుంది. దీంతో వారు 200 లోపు యూనిట్ల విద్యుత్తును వినియోగించుకుని తక్కిన విద్యుత్తును గ్రిడ్ కు అనుసంధానం చేయడం జరుగుతుంది. రెండు కిలోవాట్ల "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు ద్వారా సుమారు 240 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది దీని ద్వారా ఇటు లబ్ధిదారులకు, అటు ప్రభుత్వానికి ,రెండు వైపులా మేలు కలిగే ఈ పథకం పైలెట్ పద్ధతిన విజయవంతం అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది .మొదటి విడతన పైలెట్ పద్ధతిని చేపట్టిన" రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్" పనులను నల్గొండ జిల్లాలో త్వరితగతిన పూర్తి చేసే విషయమై జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా కనగల్, హాలియా మండలాలలో బుధవారం తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాలలోని గృహ జ్యోతి లబ్ధిదారుల గృహాలపై "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కనగల్ గ్రామంలో ఇప్పటివరకు 77 ఇళ్లపై పై" రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, తక్కిన ఇళ్లపై కూడా సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు అవకాశాలను పరిశీలించి నిర్దేశించిన సమయంలో సోలార్ సిస్టం యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పక్కనే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. లబ్ధిదారు నల్లబోతు వెంకటమ్మతో మాట్లాడుతూ ఇంతవరకు ఎంత ఖర్చు అయిందని ? ఇంటి నిర్మాణం ఎప్పుడు మొదలుపెట్టారని? బిల్లులు వస్తున్నాయా? అని అడిగారు. మొదలుపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులన్ని త్వరితగతిన పూర్తిచేయాలని, అలాగే బిల్లులు సైతం చెల్లిస్తున్నామని, ఎలాంటి అకౌంట్ సమస్యలు లేవని, శాంక్షన్ ఆర్డర్ తీసుకున్న తర్వాతే ఫోటో క్యాప్చర్ చేసుకొని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి తో మాట్లాడుతూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కనగల్ మండలంలో ఇప్పటివరకు కేవలం 47% మాత్రమే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగిందని, అందువలన రైతులందరూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, మండలంలో నూటికి నూరు శాతం రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీ కావాల్సిన అవసరం ఉందని అన్నారు.రైతులు ఎవరైనా ఇతర ప్రాంతాలలో ఉన్నట్లయితే వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చూడాల్సిందిగా సర్పంచ్ మురళీధర్ తో కోరారు. జిల్లా కలెక్టర్ వెంట రెడ్ కో జిల్లా మేనేజర్ సంతోష్,ట్రాన్స్కో ఏఈ ఆర్ ఎన్. జె. కుమార్, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, సెక్రటరీ వీరబాబు, తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించిన రైస్ మిల్ యజమానుల అరెస్టు

* **జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి సుమారు రూ.43 కోట్ల మేర నష్టం కలిగించిన ప్రధాన నిందితు లైన రైస్ మిల్ ఎనిమానులను బుధవారం నల్లగొండ పోలీసులు అరెస్టు చేసినట్లు శరత్ చంద్ర పవర్ తెలిపారు బుధవారం ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ కేసును తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్నల్గొండ జిల్లా మేనేజర్ ఫిర్యాదు మేరకు నమోదు చేయడం జరిగింద ని తెలిపారు . కె.శివరాం రెడ్డి, డి.ఎస్.పి నల్గొండ పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టి, బుధవారం ఉదయం 11:00 గంటలకు నల్గొండ మండలంలోని దోమలపల్లి గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. కందుకూరి మహేందర్, రవీంద్ర నగర్, నల్గొండ. కందుకూరి పద్మ నివాసం: రవీంద్ర నగర్, నల్గొండ పట్టణం. లను అరెస్టు చేయగా,మాశెట్టి రాధా కృష్ణ మేడమ్ కృష్ణమూర్తి ఇడుకుళ్ళ దామోదర్. కందుకూరి రవి కుమార్.బూరుగు బాలకృష్ణ లు పరార్ లో ఉన్నట్లు తెలిపారు వీరి వద్ద నుండి నగదు - రూ.1,09,000/మూడు సెల్ ఫోన్లుబెలెనో కారు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు నిందితులు 202223 రబీ సీజన్‌లో నిందితులు నల్గొండ జిల్లా పరిసర ప్రాంతాలలోని సుమాంజలి పార్ బాయిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ - ఆర్జాలబావి, నల్గొండ. వరలక్ష్మి పార్ బాయిల్డ్ మిల్ - చిట్యాల మనోహర ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ - మునుగోడు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరిలో కందుకూరి మహేందర్ ప్రధాన పాత్రధారిగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ ఏజెంట్ /మర్చంట్‌గా రైతుల నుండి కనీస మద్దతు ధర ఎం ఎస్ పి కింద ఐకెపి, పిఎసిఎస్ డీఏవో, ఎండిసిఎంఎస్, ఎఫ్ పి ఓ ల ద్వారా కొనుగోలు చేసిన ప్యాడీకి సరిపడా బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా, కుట్రపూరితంగా ధాన్యాన్ని అక్రమంగా విక్రయించారని ఎస్పీ తెలిపారు.ఈ మూడు రైస్ మిల్లుల ద్వారా మొత్తం 13,170.061 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి సుమారు రూ.43 కోట్ల నష్టం కలిగించినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. వీటిలో సుమాంజలి మిల్ - సుమారు రూ.22 కోట్ల నష్టంవరలక్ష్మి మిల్ - సుమారు రూ.19.33 కోట్ల నష్టం,మనోహర మిల్ - సుమారు రూ.1.47 కోట్ల నష్టం చేశారని ఈ కేసులో నిందితులు నేరపూరిత నమ్మక ద్రోహానికి పాల్పడి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టినట్లు విచారణలో తెలిపగా వీరిపై నల్గొండ రూరల్,చిట్యాల, మునుగోడు పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు చేసి రిమాండు పంపమన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ కేసును నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తులో పాల్గొన్న నల్గొండ II టౌన్ సీఐ రాఘవరావు,నార్కట్‌పల్లి సీఐ నాగరాజు,నల్గొండ రూరల్ ఎస్.ఐ సైదాబాబు,మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.




# ఉన్నతాధికారి సునీల్ నాయక్‌పై కక్షసాధింపు హేయం

* **జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగడం హేయమని బంజారా సంఘాల జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసత్య ఆరోపణలతో ఇరికించే ప్రయత్నం జరుగుతోందన్నారు. రఘురామ కృష్ణ రాజు అరెస్టు వ్యవహారంలో సునీల్ నాయక్‌కు సంబంధం లేదని, 2024లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరు లేదని తెలిపారు. ప్రస్తుతం బీహార్‌లో పనిచేస్తున్న ఆయనను వారెంట్ లేకుండా అరెస్టు చేసేందుకు పోలీసులు వెళ్లడాన్ని ఖండించారు. పాట్నా కోర్టు అరెస్టుకు వారెంట్ నిరాకరించడం ప్రాథమిక విజయమన్నారు.ఎస్టీ వర్గానికి చెందిన అధికారిపై చర్యలను బంజారా సమాజం ఖండిస్తోందని, కేసులు ఎత్తివేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ధరావత్ కాన్షీరామ్, గుగులోత్ కేశవ్, గణేష్ మహరాజ్, బానోత్ రమేష్ నాయక్, గుగులోత్ భద్రు, ధరావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.







# డిప్యూటీ కలెక్టర్ గా చిత్రు పటేల్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల లో చదివిన, చిత్రు పటేల్ ( డిప్యూటీ కలెక్టర్) తాను చదువుకున్న ఉన్నత పాఠశాల కి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం తనని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడో మారుమూల గ్రామంలో జన్మించిన చిత్రు పటేల్ (డిప్యూటీ కలెక్టర్) మా పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం జగిత్యాల జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిగా గా పని చేస్తూ వున్నారు. అని తమ పాఠశాలకు విచ్చేసిన సందర్భంగా ఆయనకు తమ పాఠశాల అధ్యాపక బృందం స్వాగతం పలికి ఘనంగా సన్మానించామని తెలిపారు. చిత్రు పటేల్ ఇదే పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా చిత్రు పటేల్ (డిప్యూటీ కలెక్టర్) మాట్లాడుతూ ఆ రోజుల్లో తనకి బోధించిన ఉపాధ్యాయులను, అప్పటి పరిస్థితులను గుర్తుకు చేసుకుంటూ ఆ రోజుల్లో మాకు సరైన వసతులు లేనప్పటికీ మేము బాగా చదివి ఈరోజు ఒక జిల్లా అధికారిగా మరియు ఒక కన్ఫాడ్ ఐఏఎస్ గా ఎదిగాను అని తెలిపారు. ఈ పాఠశాల శర్మన్ నాయక్ లాంటి ఐఏఎస్ లను, జస్టిస్ చంద్రయ్య లాంటి జడ్జిలను ఎంతోమంది ఉన్నతాధికారులను తయారు చేసింది అని కాబట్టి అలాంటి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ ప్రభుత్వం కల్పిస్తున్న మంచి సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉపాధ్యాయుల మంచి సలహాలతో జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని ఆ లక్ష్యం కోసం ఇష్టంతో కష్టపడి చదివితే ఎలాంటి ఉన్నత లక్ష్యాన్ని అయినా సాధించవచ్చు అని అన్నారు. తనలాగే విద్యార్థులందరూ కూడా ఈ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.మనిషి క్రమశిక్షణ, కష్టపడే మనస్తత్వం, పట్టుదల ఉంటే మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శివరాజం మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థి జన్మించింది మారుమూల గ్రామమైనప్పటికీ" మన జననం సాధారణమైనదే కావచ్చు కానీ మన మరణం చరిత్ర సృష్టించేదిగా ఉండాలి" అన్న వివేకానంద స్వామి గారి మాట ప్రకారం చిత్రు పటేల్ గారు మారుమూల గ్రామమైన అలీనగర్ లో పుట్టి పెరిగి మన పాఠశాలలో చదువుకొని ఈరోజు ఈ స్థాయికి ఎదిగి తాను చదివిన పాఠశాలకే తాను ముఖ్యఅతిథిగా రావడం గర్వించదగ్గ విషయం. అదేవిధంగా మీరు కూడా బాగా చదివి మంచి ఉన్నతాధికారులుగా ఎదిగి భవిష్యత్తులో మీరు చదివిన ఈ పాఠశాలకు చిత్రు పటేల్ గారి లాగానే ముఖ్యఅతిథిగా రావాలనే లక్ష్యాన్ని ఎంచుకోవాల్సిందిగా విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫిరాజి, భీర్షా, పీడీ గణేష్, శంకరయ్య, కిషన్ రావు, చందులాల్, పాఠశాల సంరక్షకులు రాజేష్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 7 నగరాల్లో 'రైల్ పార్సిల్' యాప్ సేవలు



సికింద్రాబాద్: రైల్ పార్సిల్ యాప్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆవిష్కరించారు. మొత్తం 7 నగరాల్లో దీని ద్వారా సేవలు అందించనున్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ, రాజమహేంద్రవరం, బెంగళూరు, చెన్నైలో ఈ సేవలు ఉంటాయి. 3 లాజిస్టిక్ పార్ట్‌నర్స్‌తో డోర్ డెలివరీ, మిడిల్ డెలివరీ, మెయిన్ డెలివరీ చేస్తారు. రైల్ పార్సిల్ యాప్‌తో సులువుగా, వేగంగా సేవలు అందుతాయని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు.

* **పెన్షనర్లకు రైల్వే శాఖ హెచ్చరికలు**

పెన్షనర్లకు రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. రైల్వే పెన్షనర్లు.. స్కామర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఏ రైల్వే అధికారి కూడా సోషల్ మీడియా, కాల్స్ ద్వారా గోప్య సమాచారాన్ని అడగరని స్పష్టం చేసింది. అనుమానాస్పద కాల్స్, సందేశాలను వెంటనే పోలీసు సైబర్ సెల్, సంబంధిత అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి నివేదించాలని పెన్షనర్లకు సూచించింది.

# రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి.. వేగవంతమైన సేవలు అందిస్తాం: పొంగులేటి



హైదరాబాద్: ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.


# భారత్‌కు భారీగా చమురు.. సూపర్ ట్యాంకర్‌లను రంగంలోకి దింపిన వెనెజువెలా..!

వెనెజువెలా తన చమురు ఎగుమతులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా భారత్‌కు భారీగా చమురు పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనికోసం 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును మోసుకెళ్లే సూపర్ ట్యాంకర్లను రంగంలోకి దింపినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాతో ఒప్పందం తర్వాత వెనెజువెలా చమురు వాణిజ్యంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని రాయిటర్స్ పేర్కొంది. దాని ప్రకారం.. చమురుకు సంబంధించి అమెరికాతో ఒప్పందం ప్రారంభమైన తర్వాత నుంచి వెనెజువెలా చమురు వ్యాపార సంస్థలు వెనెజువెలా నుంచి ఎగుమతుల కోసం మొట్టమొదటిసారి వెరీ లార్జ్ క్రూడ్ ఆయిల్ క్యారియర్‌లను (VLCC)ను అద్దెకు తీసుకున్నాయి. దీంతో భారత్‌కు డెలివరీలు గణనీయంగా పెరుగుతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.




జనవరి నుంచి ట్రేడింగ్ సంస్థలు విటోల్, ట్రాఫిగురాలు ఈ చమురు ఎగుమతులు చేస్తున్నాయి. వెనెజువెలాకు చెందిన ప్రభుత్వ చమురు సంస్థ నిర్వహిస్తున్న జోస్ టెర్మినల్‌లో నిస్సోస్ కీ, నిస్సోస్ క్రైత్నోస్, అర్జానా అనే మూడు నౌకలకు మార్చిలో లోడింగ్ కోసం స్లాట్లను కేటాయించారు. ఈ మూడు భారత్‌కు రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను ప్రారంభించిందని ఇటీవల అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ప్రైవేట్ రిఫైనరీ హెచ్‌ఎంఈఎల్‌లు చెరో ఒక మిలియన్ బ్యారెళ్ల చొప్పున చమురు కొనుగోలు చేశాయని అధికార వర్గాలు తెలిపాయి.

## పేరులో అక్షరం తేడా.. 45 ఏళ్లుగా నో పెన్షన్..!



తండ్రి మరణం తర్వాత వచ్చే పింఛను కోసం ఓ మహిళ నాలుగు దశాబ్దాలకుపైగా పోరాటం చేస్తున్నారు. పేరులో ఒక్క అక్షరం తేడా ఉందనే కారణంతో పింఛను ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో ఆమె అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. అధికారుల తీరుపై మండిపడింది. సమస్య పరిష్కారానికి వారంలోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు చెందిన మంజు రాయ్ తండ్రి స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేశారు. 1975లో పదవీ విరమణ చేశారు. 1980లో మృతి చెందగా.. అప్పటివరకు పింఛన్ సరిగ్గానే వచ్చేది. అనంతరం ఫ్యామిలీ పెన్షన్ కోసం కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోగా.. ఆయన పేరులో అక్షరం తేడా ఉందనే కారణంతో నిరాకరించారు. సర్వీసు రికార్డుల్లో ఆయన పేరు శిఖర్ నాథ్ శుక్లాగా నమోదై ఉండగా.. దరఖాస్తు, ఇతర పత్రాల్లో శేఖర్ నాథ్ శుక్లాగా ఉంది. 'I', 'E' తేడాతో ఫ్యామిలీ పెన్షన్ మంజూరు కావడం లేదు. 45 ఏళ్లుగా సమస్య అలాగే కొనసాగుతోంది. దీంతో మంజు రాయ్.. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పేరులో ఒక్క అక్షరమే తేడా ఉందని, దీనిపై అఫిడవిట్ కూడా సమర్పించినట్లు పేర్కొన్నారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలను కూడా జతచేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. లేనిపక్షంలో తదుపరి విచారణకు మున్సిపల్ కమిషనర్ స్వయంగా హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## యూకే ప్రయాణం.. భారతీయులకు ఈ-వీసా తప్పనిసరి

యూకేలో కొత్త డిజిటల్ వీసా వ్యవస్థ నేటి నుంచి అమల్లోకి వచ్చింది. సంప్రదాయ వీసాల స్థానంలో ఈవీసాలను అందుబాటులోకి తెచ్చారు. యూకేకు వెళ్లే భారతీయులు ఇకమీదట ఈవీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన షేర్ కోడ్ ఉంటుంది. దీన్ని ఉద్యోగ సంస్థలు, యజమానులు తదితరులతో పంచుకునే అవకాశం కల్పించారు. ఈ కొత్త పద్ధతిలో పేపర్ ఆధారిత వీసా స్టిక్కర్ల స్థానంలో డిజిటల్ వీసాలను అమలు చేయనున్నారు. డిజిటల్ వ్యవస్థ అయినప్పటికీ.. బయోమెట్రిక్ నమోదు కోసం వీసాదారులు దరఖాస్తు కేంద్రానికి వెళ్లాల్సిందే. అయితే, ప్రాసెసింగ్ సమయంలో పాస్‌పోర్టును అక్కడే వదిలి వెళ్లాల్సిన అవసరం మాత్రం ఉండదు. ఈవీసా లేదా ఇతర దస్త్రాలు లేకుంటే విమానయాన సంస్థలు ప్రయాణికులను అడ్డుకునే అవకాశం ఉంటుంది. ఈవీసాను పోగొట్టుకోవడం, తస్కరించడం లేదా మార్పు చేసే అవకాశం ఉండదని, వీసాదారులు ఇమిగ్రేషన్‌ను వేగంగా, సురక్షితంగా నిర్ధరించుకునే వీలుకలుగుతుందని బ్రిటన్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఇమిగ్రేషన్ స్థితిలో




మార్పులు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. బ్రిటన్ సరిహద్దు, ఇమిగ్రేషన్ వ్యవస్థను పూర్తి స్థాయిలో నవీకరించడంలో భాగంగా ఈవీసా విధానాన్ని గతేడాది ప్రారంభించారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది.

## పర్సనల్ టూర్ కోసం 50 మంది సిబ్బంది
# BSNL డైరెక్టర్ తీరుపై కేంద్రం సీరియస్

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) సీనియర్ డైరెక్టర్ వివేక్ బంజల్‌పై కేంద్రం సీరియస్ అయింది. తన ప్రయాగ్‌రాజ్ పర్యటన ఏర్పాట్ల కోసం చేసిన డిమాండ్లు వైరల్ కావడంతో అతడికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈ ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తీవ్రంగా స్పందించారు. అధికారి ఇచ్చిన వివరణ ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**ఈ టూర్ వివాదం ఏంటంటే..?**

వివేక్ బంజల్ ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ సమయంలో 21 పనులు చేసేందుకు 50 మంది బీఎస్ఎన్ఎల్



సిబ్బందిని కేటాయించాలని డిప్యూటీ మేనేజర్ లెవెల్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో ఆయన దిగగానే స్వాగతం పలకాలి. ఆలయ సందర్శనలు, బోట్ రైడ్స్‌ను సమన్వయం చేసుకోవాలి. టవల్స్, అండర్‌గార్మెంట్లు, నూనె, దువ్వెన వంటి వాటితో 'స్నాన్' కిట్స్ సిద్ధం చేయాలి. మతపరమైన కార్యకలాపాల కోసం రవాణా సౌకర్యాలు చూసుకోవాలి. ఫొటోలు తీయాలి. అలాగే ప్రయాణం కోసం ఏర్పాటుచేసిన వాహనాల్లో వాటర్ బాటిల్స్, చాక్లెట్లు, స్నాక్స్ ఉండేలా చూడాలి. ఈ విస్తృత సన్నాహాలకు సంబంధించిన ఆర్డర్ ఆన్‌లైన్‌లో వెలుగులోకి రావడంతో తీవ్ర వివాదమైంది. వనరుల దుర్వినియోగంపై నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారం కేంద్రం దృష్టికి చేరడంతో ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని బంజల్‌ను ఆదేశించింది. ఈ ప్రవర్తన నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుందని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.


## ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశం వివాదం.. స్పందించిన కేంద్రం..!



నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడం తీవ్ర వివాదమైంది. దానిపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. వివాదాస్పదమైన ఆ అంశాలను తొలగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. అలాంటి అంశాలను చేర్చకుండా ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అవి ఆమోదయోగ్యమైనవి కావని, వాటి స్థానంలో స్ఫూర్తిదాయక అంశాలు చేర్చాల్సిందని వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు రాసుకొచ్చాయి. 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఎన్సీఈఆర్టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ''ఈ వ్యవహారం అందరినీ కలవరానికి గురిచేసింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోం'' అని సీజేఐ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## ఎయిర్ అంబులెన్స్ క్రాష్.. దానిలో బ్లాక్‌బాక్స్ లేదా..?

ఝార్ఖండ్‌లో ఎయిర్‌అంబులెన్స్ కూలిపోయిన ఘటనలో ఓ కొత్తకోణం వెలుగు చూసింది. దానిలో బ్లాక్‌బాక్స్ లేదని తెలుస్తోంది. దీంతో ప్రమాద కారణాన్ని తెలుసుకోవడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారనుంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం బరువు 5,700 కిలోల కంటే తక్కువ ఉండటంతో దానిలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్ లేవు. పౌర విమానయాన నిబంధనల ప్రకారం ఈ బరువు కంటే తక్కువ ఉన్న విమానాల్లో వాటి అవసరం లేదు. ఈనేపథ్యంలో ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్‌తో పైలట్ జరిపిన కమ్యూనికేషన్ రికార్డుల ఆధారంగానే ఇప్పుడు దర్యాప్తు చేయాల్సిఉంటుంది. అలాగే శిథిలాల విశ్లేషణ, ప్రత్యక్ష సాక్షుల కథనాలు విచారణకు కీలకంగా మారనున్నాయి. బ్లాక్‌బాక్స్ (Black box)లో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డీఎఫ్‌డీఆర్), రెండోది కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్). డీఎఫ్‌డీఆర్.. కీలక పరికరాలైన ఫ్లాప్‌లు, ఎలివేటర్, రడ్డర్ స్థితిగతులతోపాటు విమానం ఎంత ఎత్తులో ఉంది, గాలి వేగం ఎంత,



ఇంజిన్ పనితీరు ఎలా ఉంది వంటి సమాచారాన్ని నమోదు చేస్తుంది. సీవీఆర్ అనేది ఒక మల్టీ ట్రాక్ రికార్డరు. ఇది కాక్‌పిట్ నుంచి వెలువడిన ప్రతి శబ్దాన్నీ నిరంతరం రికార్డు చేస్తూనే ఉంటుంది.

## అప్పుడే జయలలితను
# సీఎం చేస్తానని శపథం చేశా

జయలలిత మరణానంతరం ఏం జరిగిందనే దాని గురించి మొదటిసారిగా శశికళ నోరు విప్పారు. రామనాథపురంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... 1987లో ఎంజీఆర్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు జయలలితను అనుమతించలేదని, ఎంజీఆర్ మృతదేహానికి పూలమాల వేసిన ఆమెను ఆర్ఎం వీరప్పన్ మద్దతుదారులు కొందరు కిందకు నెట్టేశారని, అప్పుడు తాను పట్టుకున్నట్లు చెప్పారు. అప్పుడే మీరు తోసేసిన జయలలితను అన్నాడీఎంకేలో ముఖ్యమంత్రిని చేసి చూపుతానని శపథం చేసినట్లు తెలిపారు. రాజకీయాలు నాకు వద్దు, అందరూ నన్ను అవమానపరిచారని జయలలిత చెప్పగా.. ధైర్యం చెప్పి రాజకీయాల్లో కొనసాగేలా చేశానని పేర్కొన్నారు. 2016లో జయలలిత అనారోగ్యం పాలయ్యారని, 72 రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొంది కుదుటపడ్డారని, ఇంటికి తీసుకొచ్చేందుకు మంచి రోజు కోసం చూస్తున్న సమయంలో ఊహించని విధంగా ఆమెకు గుండెపోటు వచ్చిందని, ఆమె మరణం తర్వాత పలువురు పలు విధాలుగా మాట్లాడారన్నారు. జయలలితను తానే హతమార్చినట్లు ప్రచారం చేశారన్నారు.

**చివరి నిమిషంలో చేజారిన పదవి**


జయలలిత మరణించిన రోజు రాత్రి మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి మీరు ముఖ్యమంత్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి కావాలని కోరారని, కానీ తాను జయలలితకు అంత్యక్రియలు చేయాలని, పన్నీర్‌సెల్వం ముఖ్యమంత్రిగా ఉండనివ్వాలని చెప్పినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అయిన పన్నీర్‌సెల్వంపై మంత్రులు ప్రతిరోజు ఫిర్యాదు చేస్తుండటంతో తాను



ముఖ్యమంత్రి అయ్యేందుకు అంగీకరించానని, ఆయన్ను అడిగే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత పన్నీర్‌సెల్వంకి ఏమయిందో తెలియలేదని, ఎవరో చెప్పడంతో జయ సమాధి వద్ద ధర్మయుద్ధం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం అదే ఆయనకు సమస్యగా మారిందన్నారు. ఆ తర్వాత తాను వద్దన్నా ప్రధాన కార్యదర్శిగా నియమించారన్నారు. తాను ముఖ్యమంత్రిగా లేఖ ఇచ్చినప్పుడు అక్కడ గవర్నర్ లేరని, ఆ తర్వాత వెంటనే కోర్టు తీర్పు వచ్చిందని, వాటన్నింటికీ తాను బయపడలేదన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని రద్దు చేయకూడదనే ప్రతిపక్ష నేతగా ప్రస్తుతం ఉన్న వ్యక్తిని (పళనిసామి) ముఖ్యమంత్రిగా కూర్చొబెట్టి జైలుకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

## రూ.30వేల లంచం.. తీగలాగితే అల్మారాలో నోట్ల కట్టలు..!

రాయగడ పట్టణం: ఒడిశాలోని ఓ ప్రభుత్వ అధికారి ఇంట్లో నోట్ల కట్టలు లభించడం తీవ్ర కలకలం సృష్టించాయి. రూ.30వేల లంచం కేసులో తీగ లాగితే.. ఆ అధికారి అవినీతి వ్యవహారం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని కటక్ సర్కిల్ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న దేబబ్రత మహంతిని అవినీతి కేసులో విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి



అరెస్ట్ చేశారు. లైసెన్స్ పొందిన ఓ బొగ్గు విక్రేత నుంచి రూ. 30 వేలు లంచం తీసుకుంటూ ఆయన విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. బుధవారం ఉదయం మహంతి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఇందులో భారీ ఎత్తున లెక్కల్లో రాని నగదు బయటపడింది. భువనేశ్వర్‌లోని ఆయన అపార్ట్‌మెంట్‌లో అల్మారాలో దాచిన రూ.4 కోట్లను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయన కార్యాలయంలోని టేబుల్‌లో మరో రూ.1.20 లక్షల నగదును గుర్తించారు. భువనేశ్వర్‌లో మరో రెండంతస్తుల భవనం, 130 గ్రాముల బంగారం గుర్తించినట్లు విజిలెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ స్థాయిలో నోట్ల కట్టలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

## అక్కడ ట్యాక్సీడ్రైవర్ కావాలంటే.. ఐఏఎస్ కన్నా ఎక్కువ చదవాలి!

సివిల్ సర్వీసెస్.. ఇండియాలోనే కాదు ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటి. ఇందులో ఉత్తీర్ణులు కావాలంటే అన్ని సబ్జెక్టులూ చదవాల్సిందే. సదరు అభ్యర్థులకు అన్ని విషయాలపై పరిజ్ఞానం ఉండాల్సిందే. కానీ, ఒక నగరంలో ట్యాక్సీ డ్రైవర్ అర్హత పరీక్షలో నెగ్గాలంటే కనీసం 25 వేల వీధులను, ల్యాండ్‌మార్క్‌లను గుర్తు పెట్టుకోవాలి. అయితే, కొన్ని నెలల్లో ఇది సాధ్యం కాదు. సంవత్సరాల తరబడి అధ్యయనం చేయాలి. డ్రైవింగ్‌లో చాకచక్యం ఉండాలి. ఇంతకీ ఆ నగరమేంటో తెలుసా..? బ్రిటన్ రాజధాని లండన్..!

**పద్మవ్యూహం కన్నా ఎక్కువే..**

లండన్ నగరం ఈ నాటిది కాదు. రోమన్ కాలం కన్నా ముందునుంచి మనుగడలో ఉంది. అప్పటి నుంచే మహానగరంగా రూపుదిద్దుకుంది. కాల ప్రవాహంలో వచ్చిన పాలకులు అనేక నిర్మాణాలను కొనసాగించారు. దీంతో నగరం నలు దిశలా విస్తరించింది. 20వ శతాబ్దంలో ఆటోమొబైల్స్ వచ్చిన అనంతరం ట్యాక్సీలూ వచ్చాయి. అయితే, ఇంత మహానగరంలో దాదాపు 25 వేలకు పైగా వీధులు, ప్రాంతాలు ఉన్నాయి. దీంతో దాదాపు 160 ఏళ్ల కిందటే ఈ పరీక్ష విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ట్యాక్సీ డ్రైవర్ అర్హత పరీక్ష పాస్ కావాలంటే కనీసం మూడేళ్లు పట్టొచ్చు. ఈ పరీక్ష కూడా కఠినంగానే ఉంటుంది. మొత్తం నగరానికి సంబంధించిన ప్రాంతాలపై ప్రశ్నలు అడుగుతుంటారు. వీటికి సమాధానమివ్వాలంటే మొత్తం లండన్ భౌగోళిక పరిస్థితుల గురించి చదవాల్సిందే.

**వీరికి అల్జీమర్స్ రాదు..**

గతేడాది ఈ నగర ట్యాక్సీ డ్రైవర్లపై



అధ్యయనం నిర్వహించారు. వీరికి నగరం మొత్తం తెలిసివుండటంతో రోజూ ఏదో ప్రాంతానికి వెళ్లడం కారణంగా అపారమైన జ్ఞాపకశక్తి ఉంటుందని తేలింది. వీరి మెదడులోని 'హిప్పోక్యాంపస్' కాస్త పెద్దదిగా ఉంటుందట. ఈ హిప్పోక్యాంపస్ చిన్నపాటి జ్ఞాపకాలను సుదీర్ఘకాలం ఉంచుతుంది. సాధారణంగా వయసు మళ్లిన సమయంలో దీని పనితీరు మందగించడంతో జ్ఞాపకశక్తి తగ్గిపోతూ ఉంటుంది. అయితే, ఈ డ్రైవర్లకు మాత్రం అన్ని వేల వీధులు గుర్తుండటంతో ఈ వ్యాధి రావడం మాత్రం చాలా అరుదని ఆ అధ్యయనం గుర్తించింది.

## ఒడిదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు

**రిలయన్స్, ఎస్‌బీఐ వంటి హెవీవెయిట్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**మార్కెట్లను ఆదుకున్న ఐటీ, మెటల్, ఫార్మా రంగాల షేర్లు**

**ప్రధాన సూచీల కంటే మెరుగ్గా రాణించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలో మంచి లాభాలతో సానుకూలంగా కనిపించినప్పటికీ ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 50.15 పాయింట్ల స్వల్ప లాభంతో 82,276.07 వద్ద, నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.50 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్లలోని అస్థిరతకు అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర భారం మోపింది. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ వంటి ఐటీ షేర్లతో పాటు టాటా స్టీల్ వంటి మెటల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు నష్టాల్లోకి జారుకోకుండా నిలిచాయి.

సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు అత్యధికంగా 2.23 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్ 2.8 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కూడా లాభాలను నమోదు చేశాయి.

ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.96 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా రాణించగా, నిఫ్టీ ఐటీ, ఫార్మా సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ ఈ సెషన్‌లో అత్యధికంగా నష్టపోయింది.

మార్కెట్ తీరుపై విశ్లేషకులు స్పందిస్తూ నిఫ్టీకి 25,400 స్థాయి వద్ద తక్షణ మద్దతు ఉందని తెలిపారు. ఒకవేళ సూచీ 25,300 స్థాయికి దిగువన స్థిరపడితే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 25,150 స్థాయి వరకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేశారు. మార్కెట్ తిరిగి పుంజుకోవాలంటే, 25,650 వద్ద ఉన్న బలమైన నిరోధాన్ని అధిగమించాల్సి ఉంటుందని వివరించారు.

## ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయి కానీ..

**ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్**

**ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉండటంపై క్షమాపణలు చెప్పిన బిల్‌గేట్స్**

**ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టీకరణ**

**ది వాల్ స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో వెల్లడించిన బిల్‌గేట్స్**



**న్యూఢిల్లీ:** సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో తన పేరు ఉండటంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ స్పందించారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయని, కానీ ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టం చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు సంబంధం ఉండటంపై బిల్ గేట్స్ తన గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు.

తాను చట్టవిరుద్ధంగా ఏ పని చేయలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆయన అంగీకరించడం గమనార్హం. నేరాల్లో మాత్రం భాగస్వామ్యం లేదని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో ఈ అంశాలను పేర్కొన్నారు.

ఎప్‌స్టీన్‌తో సంబంధాలు, అతని సమావేశాలలో గేట్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొనడం తాను చేసిన తప్పు అని అంగీకరించారు. ఎప్‌స్టీన్ నేరాలు తమ ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు వ్యతిరేకమని తెలిపారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తమ ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

## ఐటీ ఆదాయ వృద్ధి 6 శాతం..

**2025-26లో 2 వేలు పెరిగిన ఉద్యోగాలు: నాస్కామ్**




**ముంబై:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఐటీ ఇండస్ట్రీ ఆశాజనక పనితీరు కనబరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2025-26లో దేశీయ ఐటీ ఇండస్ట్రీ ఆదాయం 6.1 శాతం ఎగబాకి 315 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నట్టు నాస్కామ్ అంచనావేస్తున్నది. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరంలో 282.6 బిలియన్ డాలర్లుగా ఉన్న ఐటీ కంపెనీల ఆదాయాన్ని 297 బిలియన్ డాలర్లకు సవరించింది. కిందటేడాది నమోదైన 5.9 శాతం కంటే ఈ ఏడాది 6.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నట్టు నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియర్ తెలిపారు. ఉద్యోగ కల్పనలో ఎల్లప్పుడూ ముందుండే ఐటీ రంగం ఈసారి కూడా అవకాశాలు 2.3 శాతం పెరిగి 59.50 లక్షలకు చేరుకోనున్నాయని చెప్పారు. కిందటేడాది చివరి నాటికి 58 లక్షల ఉద్యోగాలు కలిగివున్నారు. మొత్తంమీద ఈ ఏడాది కొత్తగా 1.35 లక్షల మంది టెక్నాలజీ నిపుణులు జతయ్యారని ఆయన చెప్పారు. కిందటేడాది వచ్చిన 1.33 లక్షల ఉద్యోగాలతో పోలిస్తే కేవలం 2 వేలు పెరిగారని తెలిపారు.

59.5 లక్షల మంది ఉద్యోగుల్లో 20 లక్షల మందికి ఏఐ నైపుణ్యం కలిగివున్నారు. వీరిలో 3 లక్షల మంది అడ్వాన్స్ ఏఐ నైపుణ్యంలో పట్టు ఉన్నది. ప్రస్తుత సంవత్సరంలో మొత్తం ఆదాయంలో 10-12 బిలియన్ డాలర్లు ఏఐ నుంచి సమకూరనున్నదని అంచనా. కీలక ఐటీ సర్వీసుల ఆదాయం 143 బిలియన్ డాలర్ల నుంచి 149 బిలియన్ డాలర్లకు పెరుగుతున్నదని అంచనావేస్తున్నది బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ నుంచి 59 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నది. కిందటేడాది ఇది 55 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అలాగే సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్‌ల నుంచి 23 బిలియన్ డాలర్ల ఆదాయం లభించనున్నది. గతేడాది ఇది 21 బిలియన్ డాలర్లు.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్..
# అగ్రస్థానంలో అభిషేక్

**టాప్-5లోకి ఇషాన్**

**టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానం నిలబెట్టుకున్న అభిషేక్**

**మూడు స్థానాలు ఎగబాకి టాప్-5లోకి చేరిన ఇషాన్ కిషన్**

**బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్న వరుణ్ చక్రవర్తి**

**ఆల్‌రౌండర్ల జాబితాలో మళ్లీ నంబర్ వన్ ర్యాంకుకు సికిందర్ రజా**

**ఆల్‌రౌండర్లలో దూబే, బౌలర్లలో బుమ్రా ర్యాంకుల మెరుగు**





**న్యూఢిల్లీ:** ఐసీసీ తాజాగా విడుదల చేసిన పురుషుల టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ తన నంబర్ వన్ ర్యాంకును పదిలంగా నిలబెట్టుకోగా, వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ తొలిసారి టాప్-5లోకి దూసుకొచ్చాడు.

టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకు పెద్దగా రాణించకపోయినా, అభిషేక్ శర్మ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్‌పై 62 పాయింట్ల ఆధిక్యాన్ని కాపాడుకున్నాడు. ఇదే జాబితాలో ఇషాన్ కిషన్ మూడు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరుకోవడం విశేషం. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును అందుకున్నాడు.

ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబే రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరాడు.

బౌలింగ్ విభాగంలోనూ భారత ఆధిపత్యం కనిపించింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా తన ర్యాంకును మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా పేసర్ కార్బిన్ బాష్ ఏకంగా 21 స్థానాలు ఎగబాకి మూడో ర్యాంకులో నిలవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

## తండ్రి అనారోగ్యంతో వరల్డ్ కప్
## క్యాంప్ విడిచిన సిక్సర్ల కింగ్...

**ఆందోళనలో అభిమానులు**



**న్యూఢిల్లీ:** భారత క్రికెటర్ రింకూ సింగ్ కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 క్యాంప్‌ను విడిచి స్వగ్రామానికి వెళ్లాడు. అతని తండ్రి ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా క్షీణించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. బీసీసీఐ సమాచారం ప్రకారం, రింకూ సింగ్ తండ్రి స్టేజ్-4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారని తెలుస్తోంది. ఈ క్లిష్ట సమయంలో కుటుంబంతో ఉండేందుకు రింకూ జట్టును తాత్కాలికంగా వీడినట్లు సమాచారం. రింకూ మళ్లీ జట్టులో చేరుతాడా? లేదా టోర్నమెంట్‌కు పూర్తిగా దూరమవుతాడా? అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. టీమ్ మేనేజ్‌మెంట్ పరిస్థితిని సమీక్షిస్తూ ఉంది. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రింకూ సింగ్ కీలక ఫినిషర్‌గా గుర్తింపు పొందాడు. ఒత్తిడి పరిస్థితుల్లో మ్యాచ్‌ను ముగించే సామర్థ్యం అతడికి ఉంది. అతని గైర్హాజరు జట్టు కాంబినేషన్‌పై ప్రభావం చూపే అవకాశముంది. ఈ వరల్డ్ కప్‌లో మాత్రం అతనికి ఎక్కువ అవకాశాలు రాలేదు. ఎక్కువగా చివరి ఓవర్లలో క్రీజ్‌లోకి రావాల్సి వచ్చింది. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 24 పరుగులు మాత్రమే చేశాడు. రెండుసార్లు అజేయంగా నిలిచాడు. అత్యధిక స్కోరు 11. ఈ ఏడాది 10 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 115 పరుగులు చేసి, సగటు 28.75, స్ట్రైక్‌రేట్ 132.18 నమోదు చేశాడు. బెస్ట్ స్కోర్ 44.

చెన్నైలో జింబాబ్వేతో జరగనున్న కీలక మ్యాచ్‌లో భారత్ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఉంది. సూపర్-8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఘోర ఓటమి పాలైన తర్వాత జట్టు సమీకరణాలు కఠినంగా మారాయి. ఈ నేపథ్యంలో రింకూ సింగ్ గైర్హాజరు జట్టుపై మానసికంగా కూడా ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అయితే క్రికెట్ కంటే కుటుంబ పరిస్థితికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో రింకూ సింగ్ కుటుంబానికి క్రికెట్ ప్రపంచం మద్దతుగా నిలుస్తోంది. అభిమానులు కూడా అతని తండ్రి ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థిస్తున్నారు.

## హాకీ గోల్‌కీపర్‌కు ప్రెసిడెన్షియల్
## మెడల్ ప్రకటించిన ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. మిలాన్ కోర్టినా ఒలింపిక్స్ పురుషుల హాకీ ఈవెంట్‌లో అమెరికాకు స్వర్ణ పతకం అందించిన గోల్‌కీపర్ కొన్నార్ హెల్లిబక్‌కు ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం అవార్డును ఇవ్వనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ ఒలింపిక్స్‌లో కెనడాతో జరిగిన గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో హెల్లిబక్ కీలక పాత్రను షోపించాడు. గోల్‌కీపర్‌గా అతను 41 గోల్స్‌ను సేవ్ చేశాడు. దీంతో మ్యాచ్ 1-1తో టై అయ్యింది. అయితే ఆ తర్వాత జాక్ హ్యూగ్స్ ఓ గోల్ స్కోరు చేయడంతో అమెరికా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. సెకండ్ హాఫ్‌లో తన స్టిక్‌తో హెల్లిబక్ గోల్‌ను ఆపడం మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఒకవేళ ఆ గోల్‌ను సేవ్ చేయకుంటే, అప్పుడు పరిస్థితి మరోలా ఉండేది. ఐస్ హాకీలో చాన్నాళ్ల తర్వాత అమెరికా జట్టు గోల్డ్ మెడల్‌ను సాధించింది. దీంతో ప్రస్తుతం అమెరికా జట్టుపై ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి.

## నన్ను లేదా నా కుమారుడిని దూషిస్తే
# పాకిస్థాన్‌కు కప్ రాదు

**కెప్టెన్ సల్మాన్ అఘా**

**ఇంగ్లాండ్ చేతిలో పరాజయం పాలైన పాక్ జట్టుపై అభిమానుల ఆగ్రహం**

**సల్మాన్ అఘాతో పాటు అతడి కొడుకును లక్ష్యంగా చేసుకుని విమర్శలు**

**అభిమానులను ఉద్దేశించి సల్మాన్ అఘా ఆవేదన**



**ఇస్లామాబాద్:** నన్ను లేదా నా కుమారుడిని అసభ్యపదజాలంతో దూషించినంత మాత్రాన పాకిస్థాన్‌కు కప్ రాదని ఆ జట్టు కెప్టెన్ సల్మాన్ అఘా అన్నాడు. టీ20 ప్రపంచకప్ సూపర్-8లో ఇంగ్లాండ్ చేతిలో పాకిస్థాన్ పరాజయంపాలైంది. మరొక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో సెమీస్ అవకాశాలు చాలా సంక్లిష్టంగా మారాయి. జట్టు ఆటతీరుపై పాక్ అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. బ్యాటింగ్‌లో సల్మాన్ అఘా విఫలమయ్యాడు.

దీంతో అభిమానులు సల్మాన్ అఘాతో పాటు అతడి కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. వారి విమర్శలపై ఆవేదన చెందిన పాక్ కెప్టెన్ తమను లక్ష్యంగా చేసుకుంటే ఫలితం ఉండదని అభిమానులను ఉద్దేశించి అన్నాడు.

ఒక మ్యాచ్‌లో ఓడిపోయి, మరో మ్యాచ్ వర్షార్పణం కావడం వల్ల పాకిస్థాన్ ఖాతాలో ఒక పాయింట్ ఉంది. ప్రస్తుతం న్యూజిలాండ్ కూడా 1 పాయింటుతో ఉంది. ఈరోజు కొలంబో వేదికగా శ్రీలంకతో జరగనున్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 3 పాయింట్లు ఉంటాయి. అప్పుడు పాక్ సెమీస్ అవకాశాలు దాదాపు ముగిసినట్లే.

ఒకవేళ శ్రీలంక చేతిలో కివీస్ ఓడిపోయినా పాక్‌కు ఇబ్బందులు తప్పవు. సూపర్ 8లో తన చివరి మ్యాచ్‌ను శ్రీలంకతో తలపడనుంది. మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా ఇంటి ముఖం పట్టాల్సిందే. ఈరోజు న్యూజిలాండ్‌పై శ్రీలంక గెలిచి, తర్వాత మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో ఓడిపోతే నెట్ రన్ రేట్ కీలకం కానుంది. న్యూజిలాండ్ తన చివరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టుతో ఓడిపోతేనే శ్రీలంక లేదా పాకిస్థాన్‌కు అవకాశం ఉంటుంది.

MOVIE TIME



# విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్

**టాకీస్:** ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ్'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పుర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో ఉదయపుర్ విమానాశ్రయం అతిథులతో కళకళలాడుతోంది. తరుణ్ భాస్కర్, రాహుల్ రవీంద్రన్, ఈషా, శ్రావ్యా వర్మ, ఆషిక రంగనాథ్, అనిల్ అంబానీలతో పాటు మరికొందరు సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.

# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

## తమన్నా భాటియా వెల్లడి

**టాకీస్:** నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.



# మార్చి 4న ఆహాలోకి ఓంశాంతి శాంతి శాంతిః


**టాకీస్:** తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఓటీటీలోకి రాబోతుంది. ఇటీవలే ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'జయ జయ జయ జయ హే' చిత్రానికి అధికారిక రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా, మార్చి 4 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ ఎ÷-లాట్‌ఫారమ్ 'ఆహా'లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. అయితే ఆహా గోల్డ్ సబ్‌స్క్రైబర్లకి మాత్రం ఒకరోజు ముందుగానే అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భర్త వేధింపులను ఎదిరించి తన ఆశయాల కోసం పోరాడే ఇల్లాలు ప్రశాంతి పాత్రలో ఈషా రెబ్బా, ఆమె భర్త ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ నటించారు. జనవరి 30న థియేటర్లలో విడుదలైన ఈ మూవీలో



బ్రహ్మాజీ, రోహిణి, శివన్నారాయణ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.


# తమిళ మూవీలో వైష్ణవి చైతన్య

టాకీస్: తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.



# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

**టాకీస్:** ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు




కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.